# ఆర్‌డిటి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం    జూన్, 2008

FOR PRIVATE CIRCULATION ONLY


## మీకు తెలుసా !

- 2025 సంవత్సరానికల్లా మన దేశంలో తలసరి నీటి లభ్యత 1140 క్యూబిక్ మీటర్లకు పడిపోతుందట. 2001లో మనకున్న తలసరి నీటి లభ్యత 1820 క్యూబిక్ మీటర్లు. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు ఇలానే సాగితే ఈతలసరి నీటి లభ్యత 1000 క్యూబిక్ మీటర్లకు కూడా పడిపోయే అవకాశముందని ఐ.పి.సి.సి. అనే సంస్థ అధ్యయనంలో తేలింది.
- భారతదేశంలో 548 మిలియన్ల ప్రజలు మలేరియా హైరిస్క్ ప్రాంతాల్లో నివస్తూ ఉన్నట్లు తాజా నివేదికలో వెల్లడయింది.
- మొత్తం ఆగ్నేసియా మద్యం ఉత్పత్తిలో మనదేశం వాటా 65 శాతం ఉంది. మద్యం దిగుమతులలో 7 శాతం వాటా ఉంది. 1992-93లో 887.2 మిలియన్ లీటర్ల ఉత్పత్తి ఉన్న మద్యం 1999-2000 నాటికి రెట్టింపయి. 1654 మిలియన్ లీటర్లకు చేరుకుంది. 2007-08 నాటికి మూడింతలై 2,300 మిలియన్ లీటర్లకు చేరుకుంది. దేశంలో తలసరి మద్యం వినియోగం ఏడాదికి రెండు లీటర్లు. గోవా, ఆంధ్రప్రదేశ్ మద్యం ఎక్కువగా అమ్ముడు పోయే రాష్ట్రాలు.
- నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సు, బెంగుళూరువారి సర్వే ప్రకారం గృహహింస నేరం కింద నమోదవుతున్న కేసుల్లో 20 శాతం మద్యపానం వల్ల జరుగుతున్నవేనని తేలింది.
- టమేటోలో బీటా కెరోటిన్ అనే యాంటి ఆక్సిడెంట్ శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అంతేకాకుండా ఈ యాంటి ఆక్సిడెంట్ వలన మనిషి చర్మంలో కూడా ఆరోగ్యవంతమైన మార్పులు వస్తాయని తేలింది. గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో టమెటోలో ఉండే విటమిన్ 'ఇ' కూడా చక్కటి పాత్రను పోషిస్తుంది.
- పగలు చల్లటినీడ ఆరోగ్యకరమైన గాలిని ఇచ్చే చెట్టు నీడలో రాత్రిపూట పడుకోకూడదని చెబుతున్నారు. పగలు మనం వదిలే బొగ్గుపులుసు వాయువును తీసుకుని చెట్లు ప్రాణవాయువుని వదులుతాయి. కానీ రాత్రి పూట సూర్యరశ్మి లేకపోవడంవల్ల చెట్లు గాలిలోని ఆక్సిజన్‌ను తీసుకుని బొగ్గుపులుసు వాయువును వదులుతాయి. అందువలన రాత్రిపూట చెట్ల కింద పడుకోవడంవల్ల ఊపిరి ఆడని పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు.

**చిట్కా :** అధిక రక్తపోటు ఉన్నవారు రోజూ మధ్యాహ్న భోజనానంతరం ఒక గంట నిద్రపోతే, రక్తపోటు అదుపులో ఉంటుంది.

# రాజీ లేకుండా సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగిద్దాం !

రాబోయే ఖరీఫ్‌కు మనం సమాయత్తం అవుతున్నాం. గత సంవత్సరం ఖరీఫ్ చివరలో వర్షాలువచ్చి పంట అక్కడక్కడా నష్టమైనప్పటికీ, మొత్తం మీద జిల్లా అంతటా వేరుశనగ సంతృప్తికరమైన దిగుబడిని ఇచ్చింది. దానికి తోడుగా వేరుశనగ ధరకూడా కలిసివచ్చింది. అయితే 1999 నుంచి 2006 దాకా వరుసగా పంటలు పూర్తిగా దెబ్బతీయడం మూలంగా అనంతపురం జిల్లా రైతాంగం తీవ్రమైన సమస్యలకు గురి అయింది. గత సంవత్సరం మంచి దిగుబడులతో పాటు ఖర్చు కూడా బాగా తగ్గింది. దీనికి కారణం చాలామంది రైతులు రసాయన మందులు, ఎరువులు లేని సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంభించారు. రసాయనాలు వాడని వ్యవసాయాన్ని గురించి మన సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసినప్పుడల్లా రైతుల నుంచి మంచి స్పందన వచ్చింది. సంస్థ సిబ్బందికి రైతులకు సజీవ మానవ సంబంధాలు ఉండడంతో రైతులను సుస్థిర వ్యవసాయం వైపు మొగ్గు చూపడానికి చేసిన ప్రయత్నం సఫలమయింది. రసాయన రహిత సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించిన రైతులు అవి మంచి ఫలితాలు ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఖర్చు బాగా తగ్గింది. ముఖ్యంగా విషపూరిత మందులను పిచికారిచేసి ప్రాణం మీదికి తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా పోయిందని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## సుస్థిర వ్యవసాయమంటే ఏమిటి ?

ఇదేమీ కొత్తదికాదు. మన వాళ్ళు చేసిన వ్యవసాయ పద్ధతులనే సుస్థిర వ్యవసాయమంటున్నాం. వారు ఈ పేరు పెట్టలేదు. మనం సుస్థిర వ్యవసాయమని, సేంద్రీయ వ్యవసాయమని, నైసర్గిక వ్యవసాయమని అనేక పేర్లతో పిలుచుకుంటున్నాం. భూమిలో అనేక జీవరాసులుంటాయని మీకు తెలుసుకదా ! అవి మొక్కలకు కావలసిన ఆహారాన్నందిస్తాయి. పశువుల ఎరువు, ఆకులు, అలములు లాంటివి వాడినప్పుడు ఇవి మరింతగా అభివృద్ధి చెంది పంటలకు బలాన్నివ్వడమే కాకుండా, రోగాలు రాకుండా కాపాడుతాయి. అదే రసాయనిక ఎరువులు రసాయనిక పురుగు మందులు వాడితే ఈ జీవరాసులు చచ్చిపోతాయి. భూమి నిస్సారమవుతుంది. రోగాల ఉధృతి పెరుగుతుంది. రసాయనాలతో చేసే సేద్యం ప్రకృతి వ్యతిరేకమైనది. రసాయనాలు లేకుండా సేంద్రీయ పద్ధతులతో చేసే వ్యవసాయం ప్రకృతి అనుకూలమైనది. వ్యవసాయానికి ప్రకృతికి అవినాభావ సంబంధం ఉంది. అనేక అనుభవాలతో మన పూర్వీకులు ప్రకృతి అనుకూలమైన సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించారు.

## సుస్థిర వ్యవసాయంలో రాజీలేని సూత్రాలు.

కొన్ని విషయాలలో ఏమాత్రం రాజీపడకుండా అనుసరించే పద్ధతులను మనం రాజీలేని సూత్రాలంటూ వ్యవహరిస్తున్నాం. ఇవి పూర్తిగా పాటించడంలోనే రాజీలేని సూత్రాల ప్రయోజనం ఇమిడి ఉంది. 1) వేసవి దుక్కులు, 2) సరిహద్దు పంటలు, 3) ఎరపంటలు, 4) అంతర పంటలు, 5) పసుపు పచ్చని డబ్బాలు, 6) తెల్లని డబ్బాలు, 7) లింగాకర్షక ఎరలు, 8) పక్షి స్థావరాలు, 9) వరిలో కాలిబాటలు, 10) వరినారు మడులలో సుడులు కత్తిరించడం. వీటిని మనం నిత్యం మననం చేసుకుంటూ ఉండాలి. వీటివల్ల ప్రయోజనాలేమిటో, ఎందుకు పాటించాలో తెలుసుకుందాం. తక్కువ ఖర్చుతో వ్యవసాయానికి మనం పూనుకుంటున్నాం. వివిధ దశలలో ఇతర సేంద్రీయ వ్యవసాయ విధానాలను కూడా మనం ఉపయోగించుకున్నా మూలసూత్రాలైన రాజీలేని సూత్రాలను అతి ముఖ్యమైనవిగా మనం భావించాలి.

**1. వేసవి దుక్కులు :-** గ్రీష్మరుతువులో విపరీతమైన ఎండలు కాస్తాయని మనకందరికీ తెలుసు. చాలా పురుగులు భూమిలో బొరియలు చేసుకుని వెళ్ళి గుడ్లు పెడతాయి. మరికొన్ని పురుగులు భూమిలోపల నిద్రావస్థలో ఉంటాయి. వేసవి కాలంలో లోతుగా దున్నడంవల్ల ఈ పురుగుల ప్యూపాలు చాలావరకు బయటపడి ఎండలకు మాడిపోతాయి. కొన్ని పక్షులకు ఆహారమవుతాయి. తలనత్తపురుగు, పచ్చపురుగు, పొగాకు లద్దెపురుగు, గులాబిరంగు పురుగు, ఎర్రగొంగడి పురుగు, వేరుపురుగు, దాసరిపురుగులు లాంటివి ముఖ్యమైనవి. తొలకరి వర్షం పడి భూమిలోపలికి తేమ ప్రవేశించడంతోనే ఇవి అన్నీ రెక్కల పురుగులు రూపంలో బయటికి వస్తాయి. పంటలకు అనేక నష్టాలు కలుగచేస్తాయి. పురుగులు విజృంభించిన తరువాత వాటిని అరికట్టడంలో విఫల ప్రయత్నం చేసి పంటలను నష్టాల పాలు చేసుకోవడంకన్నా, మొగ్గలోనే వీటిని తుంచే ప్రయత్నం చేస్తే మంచిది కదా ! గొంగలిపురుగు వేరుపురుగు వేరుశనగ పంటలో ఎంత నష్టాన్ని కలుగజేస్తాయో మనకందరికీ అనుభవముంది. ప్యూపాలను నివారించడమే కాకుండా, భూమి దున్నడం వలన భూమి గుల్లబారి వర్షపునీటిని ఎక్కువగా గ్రహిస్తుంది.

**2) సరిహద్దు పంటలు :-** ప్రతి ప్రధాన పంటను కాపాడుకోవడానికి సద్ద జొన్నలాంటి ఎత్తుగా పెరిగే పంటల్ని సరిహద్దు పంటలుగా వేస్తే బయటినుంచి వచ్చే పురుగులు ఆకర్షితమై సరిహద్దు పంటమీదే వాలుతాయి.

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

ప్రధాన పంటకు రక్షణగా ఉంటుంది. పశువుల మేతగా కూడా ఉపయోగపడుతుంది. పంట కూడా వస్తుంది. ప్రధాన పంటసాలుకు అడ్డంగా సరిహద్దు పంటవేయడం వలన వర్షం నీరు బయటికి వెళ్ళకుండా సహాయపడుతుంది. గత సంవత్సరం సరిహద్దు పంట వేసిన పొలాల్లో వేరుపురుగు కూడా బాగా తగ్గింది.

**3) ఎరపంటలు :-** పంటలకు హాని చేసే పురుగులు ప్రధాన పంటను నష్టపర్చకుండా ఎరపంటలు వేయాలి. అలసంద, పెసలు, సోయాచిక్కుడు ఆముదము లాంటివి వేసుకోవడంవలన పచ్చపురుగు, పొగాకు లద్దె పురుగు వాటిని ఎరపంటలు ఆకర్షిస్తాయి. ఎర్రగొంగళి పురుగుకు జిల్లేడు, అడవి ఆముదం లాంటివి ఉపయోగపడుతాయి. వేరుపురుగుకు ఎరపంటగా జనుము ఉపయోగపడుతుంది.

**4) అంతర పంటలు :-** ప్రతి పంటలో వైవిధ్యమైన పంటలుండడం అత్యంత అవసరం. జొన్న, కంది, అలసంద, పెసలు, నువ్వులు లాంటివి అంతర పంటలుగా వేసుకోవడంవల్ల ఏ పంటను ఆకర్షించే పురుగులు ఆ పంటలనే ఆకర్షిస్తాయి. ప్రధాన పంటమీద బరువు తగ్గుతుంది. ముఖ్యంగా బహుళ పంటలుగా పప్పుధాన్యాలు పండించడంవల్ల ఆహార భద్రత పోషకాహారం కూడా లభ్యమవుతుంది.

**5) పసుపు పచ్చని డబ్బాలు :-** డబ్బాలు లేక పళ్ళాలు ఏవి వీలయితే అవి అనుకూలంగా అమర్చుకోవచ్చు. పసుపు రంగు పూసిన డబ్బాకు చుట్టూ జిగురులాంటిది లేదా గ్రీజు పూసి ఎకరాకు 5 చొప్పున అమర్చాలి. తెల్లదోమ తల్లి పురుగులు ఆకర్షితమై పైకి ఎగరకుండా అంటుకుపోతాయి. చివరకు చనిపోతాయి. ఈ రకంగా ఎలాంటి ఖర్చులు లేకుండా ఈ పురుగును అదుపు చేయవచ్చు. తెల్లదోమ తల్లి పురుగులు ఎర్రని పచ్చని శరీరం తెల్ల రెక్కలు కలిగి సున్నితంగా ఉంటాయి. ఇవి పసుపు రంగులో ఆకుల అడుగు భాగాన గుడ్లు పెడుతాయి. తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడంవలన ఆకులు రాలిపోతాయి. పత్తి, టమోటోలలో ఆకుముడత తెగులు, బెండలో వెర్రితెగులు వ్యాపింపచేస్తుంది. ఏమాత్రం శ్రమ, ఖర్చు లేకుండా పురుగులను అదుపు చేసుకునే ఉత్తమమైన మార్గం ఇది.

**6) తెల్లని డబ్బాలు :-** పై విధంగానే గ్రీజు రాసిన తెల్ల డబ్బాలు ఎకరానికి 5 చొప్పున పొలంలో అక్కడక్కడా ఉంచాలి. తెల్ల రంగుకు ప్రధానంగా తామర పురుగు తల్లి పురుగులు ఆకర్షితమవుతాయి. తామరపురుగులు గోధుమ రంగులో చిన్నవిగా పసుపు రంగులో ఉంటాయి. ఇవి చీలిన రెక్కలతో ఈనెల మధ్య దాగిఉంటాయి. ఆకుల అడుగు భాగంలో గుడ్లు చొప్పించి పెడుతాయి. పిల్ల, పెద్ద పురుగులు ఆకుల అడుగుభాగాన గీకి రసాన్ని పీల్చడంవల్ల ఆకుల అడుగు భాగంలో వెండి రంగులో మెరుస్తూ కన్పిస్తాయి. పురుగు రసం పీల్చిన భాగాలు ముడుచుకుపోయి కప్పుల్లా మారుతాయి. మొక్క గిడసబారుతుంది. ఇవి కొన్ని పంటలలో వైరస్ తెగుళ్ళను వ్యాపింపజేస్తాయి. జొన్న, మొక్కజొన్న పంటలలో పంట మార్పిడి చేయడంవల్ల కూడా ఈ పురుగు ఉధృతి తగ్గుతుంది.

**7) లింగాకర్షక ఎరలు / బుట్టలు :-** ప్రతి ఆడ రెక్కల పురుగు మగ రెక్కల పురుగును ఆకర్షించడానికి ఒకరకమైన వాసన విడుదల చేయడంద్వారా రసాయనిక సంకేతం ఇస్తుంది. ఆ వాసన ఎక్కడి నుండీ వస్తోందో కనుగొంటూ మగ పురుగు అక్కడికి చేరుతుంది. లింగాకర్షక రసాయనం ఒక ఎరలో పెట్టి పొలంలో అమర్చినపుడు మగ పురుగు ఆడపురుగు అని భ్రమపడి ఎరలో చిక్కుకుపోతుంది. ఈ రసాయనం ఒక్కో రకం పురుగును బట్టి మారుతూ ఉంటుంది. ఒక రకపు పురుగు రసాయనం మరొక రకపు పురుగులను ఆకర్షించలేదు. ఈ పద్ధతి ద్వారా అన్ని రకాల పురుగులను నివారించలేము. ఉదాహరణకు పచ్చపురుగు సుమారు 200 రకాల మొక్కలను ఆశిస్తుంది. ఎక్కువగా పురుగులు ఎరల్లోకి పడుతున్నాయంటే అవి గుడ్లు పెట్టే ప్రయత్నంలో ఉన్నాయని అర్థం చేసుకుని తగిన నివారణ చర్యలు చేపట్టాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకొని పచ్చపురుగు ఉధృతి కనుక్కోవచ్చు. పత్తి, వేరుశనగ, మిరప, టొమెటో, ప్రొద్దుతిరుగుడు, కంది లాంటి పంటలు నష్టపోకుండా కాపాడుకోవచ్చు. ఇవి ఆకులను తిని జల్లెడగా మారుస్తాయి. ఆముదం ఆకులమీద వీటి ప్రభావాన్ని బాగా గమనించవచ్చు. వరిలో కాండం తొలుచు పురుగుకు కూడా లింగాకర్షక ఎరలు పెట్టవచ్చు. మొవ్వకుళ్ళు, తెల్లకంకి నష్టాల్ని అరికట్టవచ్చు.

**8) పక్షిస్థావరాలు :-** పక్షులు రైతులకు నిజమైన మిత్రులు. పొలంలో పక్షులు వాలడానికి అనువైన చెట్లు ఉన్నప్పుడు పక్షులు చెట్లపై వాలి భూమిమీద ఉన్నటువంటి పురుగులను ఏరి తింటాయి. ఆ రకంగా, పురుగులను నియంత్రిస్తాయి. ఇపుడు పొలాల్లో చెట్లుండవు కాబట్టి పక్షులు వాలడానికి ప్రత్యేకంగా నిర్మించేవే పక్షి స్థావరాలు. 5–6 అడుగుల కర్రకు పైభాగాన అడ్డంగా 2–3 అడుగుల కర్రను కడితే అదే పక్షి స్థావరమవుతుంది. దీనికోసం ప్రత్యేకంగా ఖర్చుపెట్టాల్సిందేమీ లేదు. పనికి రాని కర్రలు ఎక్కడైనా దొరుకుతాయి. ఎకరానికి కనీసం పది పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం మంచిది. రసాయనిక పురుగు మందులు వాడడం మానివేస్తే, మిత్రపురుగులు అభివృద్ధి చెందుతాయి. పక్షులు కూడా పొలంలో వాలుతాయి. పక్షుల్ని ఎక్కువ సేపు పొలంలో ఉండేటట్లు ఏర్పాట్లు చేయాలి. అపుడు అవి అనేక రకాల కీటకాలను, లార్వాలను ఏరి తింటాయి. ఈ కర్రలను పంట గింజకట్టే దశలో తీసివేయాలి. ఇవి అవీ అంటూ తేడా లేకుండా అన్నిరకాల పరుగులను పక్షులు ఏరి తింటాయి. కాబట్టి అవి అన్ని పంటలకూ ఉపయోగపడతాయి.

**9) కాలిదోవలు :-** వరిపంటలో ప్రతి రెండు మీటర్లకు కాలి దోవలు ఏర్పాటు చేయడం మూలంగా గాలి విసిరి సుడిదోమ అరికట్టబడుతుంది. సుడిదోమ తల్లి, పిల్ల పురుగులు వరి మొక్కల మొదళ్ళ దగ్గర చేరి నీటిమట్టానికి కొంచెం ఎత్తులో కాండం నుంచి రసం పీల్చడం మూలంగా, వరి ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. ఈ విధంగా పొలంలో అక్కడక్కడా వృత్తాకారంగా ఎండిపోయి ఉంటాయి. కాలిబాటలు ఏర్పాటు చేయడంవల్ల, గాలి స్వేచ్ఛగా వరి కయ్యలలోకి ప్రవేశించి పురుగు ఉధృతి అరికట్టుతుంది.

**10) సుడులు తెంపడం :-** వరిపంటలో కాండం తొలుచుపురుగును అరికట్టడానికి ఈ పద్ధతిని అవలింబించాలి. నారుపీకి నాటుకునే దశలో నారు సుళ్ళు కొసల్ని తెంచి వేయాలి. దీనికి కారణం ఆకుపైభాగం చివర్లో కాండం తొలుచు పురుగు వరి మొక్కల కొసళ్ళలో 150–200 దాకా గుడ్లు పెట్టి నూగుతో కప్పుతాయి. కొసళ్ళను తెంచి వేయడం ద్వారా గుడ్లను నాశనం చేయవచ్చు.

ఈ రాజీలేని సూత్రాల్ని పాటించడంతోటే వ్యవసాయం పూర్తవుతుందని కాదు. సుస్థిర వ్యవసాయంలో ఇవి మైలురాళ్ళ వంటివి. వీటిని పాటించడంలో ఎలాంటి వెసులుబాట్లు ఉండరాదనే అభిప్రాయంతోనే వీటికి రాజీలేని సూత్రాలని పేరు పెట్టారు. అసలు పురుగుల్ని వాటి స్వభావాల్ని అర్థం చేసుకుంటే 50 శాతం వ్యవసాయం సులువయినట్లే. వాటి బలహీనతల్ని గుర్తెరిగి వాటి నివారణకు కృషిచేయాలి. కేవలం రసాయనిక పురుగుమందులు మానివేయడమేకాదు, ఎలాంటి పురుగుమందులు అవసరంలేని విధంగా మనం ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రకృతిలోనే హానిచేసే పురుగుల్ని అరికట్టడానికి అనేక రకాల మిత్రపురుగులు ఉన్నాయి. వాటిని చంపే ప్రక్రియ మానివేసినపుడు మిత్రపురుగులు క్రమేణా అభివృద్ధి చెందుతాయి. ఆ రకంగా ప్రకృతిచ్చే చీడపీడల్ని సహజసిద్ధంగా నివారిస్తుంది. ఈ విషయాల్ని మనం దృష్టిలో ఉంచుకుంటే ప్రకృతిమీద విశ్వాసం పెరుగుతుంది. ప్రకృతిమీద విశ్వాసం అభివృద్ధి చెందినపుడు ప్రకృతికి మనం హాని చెయ్యం. అపుడు ప్రకృతి పంటలనే కాదు మనల్ని కూడా రక్షిస్తుంది. రోగాలు రాకుండా కాపాడుతుంది. కొత్త రోగాలు అభివృద్ధి చెందకుండా అరికట్టబడుతుంది.

ముఖ్యంగా మన జిల్లాలో వేసే వేరుశనగకు గొంగళిపురుగు, వేరుపురుగు బెడద ఎక్కువగా ఉంది. వేప చెక్కను ఎరువుగా వేస్తే వేరుపురుగు అరికట్టబడుతుంది. గత సంవత్సరం చాలా మంది రైతులు వేపచెక్క వేసి వేరు పురుగు రాకుండా కాపాడుకున్నారు. వర్షాలు వచ్చినపుడు పొలాల్లో సామూహికంగా రాత్రిళ్ళు మంటలు వేస్తే గొంగళి పురుగు, రెక్కల పురుగులు ఆ మంటలలో పడి చనిపోతాయి. వీటితోపాటు అనేక ఇతర రెక్కల పురుగులు కూడా నాశనమవుతాయి. అలాగే దీపపు ఎరలు పెట్టికూడా పురుగుల్ని నియంత్రించవచ్చు. పొలంలో 150 వాట్లు బల్బు రాత్రిపూట వేలాడదీసి దానికింద తొట్టిలో నీరుపోసి, ఒక మూత కిరోసిన్ పోసి పెడితే రెక్కల పురుగులు దీపపు వెలుతురుకు ఆకర్షించబడి తొట్టిలోపడి చనిపోతాయి. సుమారు నాలుగు ఎకరాలాకు ఈ విధమైన దీపపు ఎర ఒకటి సరిపోతుంది. వరిని ఆశించే కాండం తొలిచే పరుగు, దోమపోటు పరుగు, ఉల్లికోడు పురుగులు కూడా రెక్కల దశలో కాంతివంతమైన దీపాలకు ఆకర్షితమవుతాయి. అందువల్ల వరిపొలాల్లో కూడా దీపపు ఎరలను వాడి ఈ పురుగులను కొంతమేరకు తగ్గించుకోవచ్చు. ఒక ప్రాంతంలో ఉన్న రైతులందరూ కలిసి తమ తమ పొలాల్లో ఈ విధంగా నిర్వహిస్తే మంచి ఫలితముంటుంది. ఈ రాజీలేని సూత్రాలను పాటించడమువలన రైతుకు ఖర్చు తక్కువ అవడంతోపాటు, భూమి ఉత్పాదకత పెరుగుతుంది. భూమి ఆరోగ్యముగా ఉంటుంది. ఇందుకు తోడుగా మనము రసాయనిక ఎరువులు వాడకుండా దిబ్బ ఎరువులు వాడడం వలన భూమి మరింత బలపడుతుంది. భూమిలో తేమ అధిక కాలం నిల్వవుంటుంది. భూమిలో నివసించే అనేక రకాల మిత్ర క్రిమికీటకాలు అభివృద్ధిచెంది పంట ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగపడతాయి.

పై విధంగా ఎన్నో రకాల ప్రయోజనమున్న సుస్థిర వ్యవసాయంతో ఈ సంవత్సరము మరింత రెట్టింపు ఉత్సాహంతో, పట్టుదలతో ముందుకు పోదామని, అనేక విధాలుగా కీడు చేస్తూ అధిక శ్రమ, అధిక ఖర్చుతో కూడిన రసాయనికాలపై ఆధారపడిన వ్యవసాయ విధానానికి స్వస్తి చెపుదామని పిలుపునిస్తూ, నమస్కారములతో...

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు – ఎకాలజి సెంటరు**

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో......

## పురుగుమందులు లేని వ్యవసాయంలో గూబనపల్లి పాలన్న

గూబనపల్లి గ్రామానికి చెందిన టి.పాలన్న తండ్రి పెద్ద పాపన్నకు (50) గ్రామంలో 5 ఎకరాల మెట్ట పొలం ఉంది. అందరిలాగే ప్రతి ఖరీఫ్‌కు రసాయనిక ఎరువులు వేయడం, రోగాలకు పురుగుమందులు కొట్టడం – ఇంతచేసినా ప్రకృతి కరుణించక పోవడంవల్ల పంట దిగుబడి రాకపోవడం జరుగుతూ వచ్చింది. ఇతరత్రా కూలిపనులు మీదనే కుటుంబపోషణ జరిగేది.

గత ఖరీఫ్ (2007)లో ఆక్షన్ ఫ్రెటర్నా / ఎకాలజీ సంస్థ సభ్యులు – సమావేశాలు నిర్వహించి రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేని సుస్థిర వ్యవసాయాన్ని గురించి వివరించారు. అవి వాడకుండానే పంటలు పండించుకోవచ్చును అని కూడా నచ్చచెప్పారు. వీరి మాటల మీద విశ్వాసముంచిన పాలన్న 5 ఎకరాలకు పశువుల ఎరువు, వేపచెక్క వేశాడు. ప్రధాన పంటగా వేరుశనగ వేశాడు. సరిహద్దు పంటగా సద్ద వేయడంవల్ల వేరుపురుగు అసలు రాలేదు. ప్రతి సంవత్సరం వేరుపురుగు సమస్య అధికంగా ఉండేది. తామరపురుగులు ఇతర వ్యాధికారకాల పురుగుల కోసం లింగాకర్షక బుట్టలు నెలకొల్పాడు. అప్పుడప్పుడూ పురుగులు లింగాకర్షక ఎరలలో కనపడేవి. అలాగే పక్షిస్థావరాలు కూడా నెలకొల్పాడు. సంస్థ సిబ్బంది వివరించినట్లుగా జీవామృతం తయారు చేసుకుని వాడినాడు. ఎప్పుడూ లేనంతగా పంట చాలా సంతృప్తికరంగా కనపడింది. వేరుశనగ దిగుబడి బాగా వచ్చింది. ముఖ్యంగా ఎక్కువగా ఖర్చులు కాలేదు. రెండుసార్లు పంటమీద వేపనూనె కషాయం చేసి చల్లినాడు. పంట చేతికొచ్చేంతవరకూ ఏ అవాంతరాలు రాలేదు కానీ, చివరగా వర్షాలు రావడంవల్ల, భూమిలోని కాయలు మొసులు పోయి పంట కొంత నష్టం అయింది.

మునుపు పంటలకు ఇప్పటికీ పోల్చుకుంటే ఖర్చు తగ్గిందని చెప్పాడు. అందుకే రాబోయే ఖరీఫ్ కోసం, ముందుగానే వేపచెక్క కొని నిల్వ ఉంచుకున్నట్లుగా చెప్పాడు. అలాగే విడి పశువుల ద్వారా కూడా పేడ ఎరువు పెంపుదల కోసం పశువులను పెంచుకుంటున్నాడు. ఒకవేళ తిరిగి పంటలకు రోగాలొస్తే, తిరిగి రసాయనిక మందులు ఎట్టి పరిస్థితులలోనూ వాడనని ఖరాఖండిగా చెప్పాడు. కషాయాల ద్వారా చీడ పీడల్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యమవుతుందని కూడా చెప్పాడు. గ్రామంలో 120 మంది దాకా ఉన్న రైతులలో గత సంవత్సరం 25 మంది దాకా రైతులు మాత్రమే పూర్తిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా వ్యవసాయం చేశారని తమ పంటలలో వచ్చిన మార్పులు చూసి మిగతా వారు కూడా ఇదే పద్ధతులను అవలంబిస్తామంటున్నారని పాలన్న చెప్పాడు.

## రసాయన రహిత వ్యవసాయం దిశగా
## గూబన పల్లి గ్రామ రైతు పార్వతమ్మ

కళ్యాణదుర్గం మండలంలోని గూబనపల్లి గ్రామ రైతులలో అధిక భాగం గత సంవత్సరం నుంచి రసాయన రహిత సుస్థిర వ్యవసాయం వైపు మొగ్గు చూపారు. ఆక్షన్ ఫ్రెటర్నా / ఎకాలజీ సంస్థ ఈ రైతులందరకీ సుస్థిర వ్యవసాయంపై శిక్షణ ఇచ్చింది. సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర వ్యవసాయ పద్ధతులకు మళ్ళిన వారిలో శ్రీమతి పార్వతమ్మ (40) భర్త మచ్చన్న ఒకరు. ఈమె చంద్రోదయ గ్రామైక్య సంఘం నాయకురాలు కూడా. చాలా చురుకైన కార్యకర్త. రసాయనిక ఎరువులు, పురుగు మందులు అవసరంలేని వ్యవసాయం సాధ్యమేనని సంస్థ కార్యకర్తలు నచ్చచెప్పటంతో 2007 ఖరీఫ్ పంట నుంచి పూర్తిగా రసాయన రహిత వ్యవసాయానికి పూనుకుంది.

ఈ మహిళా రైతు కుటుంబానికి 5 ఎకరాల మెట్ట పొలం ఉంది. పశువుల ఎరువుల కొరకు, అదనపు ఆదాయం కొరకు 3 ఎనుములు, 5 ఆవులు పెంచుకుంటోంది. భర్తతో పాటు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కరువులవల్ల, తెగుళ్ళవల్ల పంటలు సరిగా పండక ఇతరత్రా కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని గడుపుకునేవారు.

సంస్థ మార్గ దర్శకత్వంలో గత ఖరీఫ్ పంటకు పశువుల ఎరువు, వేపచెక్క వేసింది. పశువుల ఎరువు, వేపచెక్క మూలంగా వేరుశనగ పంట వర్షాధారం కింద ఏపుగా పెరిగింది. ప్రతి సంవత్సరం వచ్చే వేరుపురుగు వేపచెక్క ప్రభావానికి రాలేదు. వేరుశనగ పంటలో కంది, అలసంద 12 సాళ్ళకు 1 సాలు అక్కడిగా వేసింది. చుట్టూ సరిహద్దు పంటగా సద్ద వేసింది. ఆకుముడత లాంటివి రాకుండా ఉండటానికి పొలంలో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలు పెట్టింది. పురుగుల్ని తినడానికి వీలుగా పక్షులు కూర్చోవడానికి అక్కడక్కడా పక్షిస్థావరాలను కూడా నెలకొల్పింది. పేడ, గంజు, పిండి కుళ్ళబెట్టి జీవామృతం తయారుచేసుకుని పొలానికి వాడింది. వేపనూనె, పచ్చిమిర్చి తదితరాలతో కషాయం తయారుచేసుకుని పంటమీద పిచికారి చేసింది.

అయిదు ఎకరాలకు 60 సంచుల (40 కేజీలు) వేరుశనగ అయింది. మునుపటికంటే విత్తనం గట్టిగా ఉంది. 1 1/2 మూటలు కందులు ఇంటి వాడకానికి పండినాయి. అలాగే అలసందలు ఆఖరికి సరిహద్దు పంటగా వేసిన సద్దకూడా 60 కేజీల ఆదాయమిచ్చింది. ఇంతబాగా పంట అయినా, ఖర్చు చాలా తక్కువైంది. గతంలో రసాయనిక ఎరువుల కోసం, రోగాలొస్తే పురుగుమందుల కోసం ఎక్కువగా ఖర్చు చేయాల్సి వచ్చేది. చివరికి పంట వచ్చిన తర్వాత ఏమీ మిగిలేదికాదు. అవి వాడినప్పటికీ ఇంత దిగుబడి ఎపుడూ రాలేదని, ఇకముందుకూడా రసాయనిక ఎరువులు, పురుగుమందుల జోలికి వెళ్ళకుండా సేద్యం చేస్తామని పార్వతమ్మ నిస్సంకోచంగా చెప్పింది.

## సేంద్రీయ పద్ధతులతో లాభాల బాటపట్టిన దానిమ్మ రైతు

అనంతపురం జిల్లాలో పండిస్తున్న దానిమ్మ, బొప్పాయి పళ్ళకు మంచి గిరాకీ ఉంది. ఈ జిల్లాలోని భూమి సహజ వాతావరణం కారణంగా ఈ జిల్లాలో పండించిన పళ్ళు చాలా రుచికరంగా ఉంటాయి. వర్షాధారం కింద మెట్ట వ్యవసాయంతో గట్టెక్కలేని రైతులు అప్పులుచేసి బోర్లు వేసుకుని దానిమ్మ, బొప్పాయి పండిస్తున్నారు. పంటలు బాగా రావాలని కాయలు సైజులు రావాలని రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగుమందులు విపరీతంగా వాడినా ఫలితం లేక బ్యాక్టీరియా రోగాలు అరికట్టలేక కొంతమంది రైతులు తోటలు కొట్టి వేసుకున్నారు కూడా. ఈ నేపథ్యంలో కణేకల్లు మండలం, కె. కొత్తపల్లి గ్రామ రైతు చిన్నపరెడ్డి రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రీయ పద్ధతులతోనే దానిమ్మ పంటను పండించుకున్నాడు. మంచి దిగుబడి కూడా సాధించాడు.

చిన్నపరెడ్డి 2001లో 4.5 ఎకరాలలో దానిమ్మ మొక్కలను నాటాడు. వీటి ఎదుగుదలకు సేంద్రీయ ఎరువులనే వాడినాడు. కానుగ, వేపచెక్క, ఆముదపు చెక్క పశువుల ఎరువు, వానపాముల ఎరువులను వాడినాడు. కాయలు ఎదుగుతున్నప్పుడు బాక్టీరియా నల్లమచ్చ తెగుళ్ళు, వేరుకుళ్ళ వ్యాధులు వచ్చినపుడు పొగాకు, వెల్లుల్లి, వేపవిత్తనాల కషాయం వాడినాడు. సంవత్సరంలో ఎకరాకు 30 వేల పెట్టుబడితో రెండు లక్షలకు పైబడి ఆదాయం సాధించాడు. జీవామృతం కూడా వాడినాడు. సేంద్రీయ ఎరువులు వాడడం వలన కాయ కూడా మంచి రంగు కలిగి నవనవలాడుతూ ఉందని, మంచి రుచి ఏర్పడిందని చెప్పాడు. తాను సేంద్రీయ పద్ధతులను అనుసరించడంవల్లనే బాక్టీరియా తెగుళ్ళు పంటలను నష్టపర్చలేదని చెప్పాడు. దానిమ్మ పళ్ళు అంతర్జాతీయ ప్రమాణాలకు లోబడి ఉండడంతో అంతర్జాతీయ మార్కెట్లులో కూడా అమ్ముడుపోతున్నాయని చెప్పాడు.

మన జిల్లాలో దానిమ్మ, బొప్పాయి రైతులు చిన్నపరెడ్డిని ఆదర్శంగా పూర్తిగా సేంద్రీయ పద్ధతులవైపు మళ్ళితే పళ్ళ తోటల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు.

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో...

## రసాయనిక పురుగు మందులు, ఎరువులు లేకుండా ఆకుకూరల్ని పండిస్తున్న కురాకులతోట గ్రామరైతులు

ఆకుకూరలు ఆరోగ్యానికి చాలామంచివని అందరూ చెప్తారు. మనం తినే ఆహారంలో ఆకుకూరల పాలు ఎంత ఎక్కువగా ఉంటే అంత మేలు అని కూడా చెప్తారు. పప్పులో, కూరల్లో, పులుసుల్లో, ఆఖరికి పకోడీల్లో ఆకుకూరలలో అంతకు మించి వాటిల్లో విషపదార్థాలు, శరీరానికి హానిచేకూర్చే సీసము లాంటి ఖనిజాలు కూడా అందులో నిక్షిప్తమై ఉంటాయని మనం ఆలోచించం. కారణం, పట్టణ ప్రాంతాల్లో చాలాచోట్ల మురుగు నీరు కాలువగట్లన, మురుగు నీరు పారించి ఆకుకూరలు పెంచి అమ్ముతుంటారు. మురుగునీటిలో ఉంటే అన్ని విషపదార్థాలు ఆకు కూరల ద్వారా తిరిగి మన శరీరానికి చేరుతాయి. ఆకులకు పురుగు ఆశించకుండా రసాయనిక పురుగుమందులు వాడుతారు. బాగా పెరగడానికి రసాయనిక ఎరువులు కూడా వాడుతారు. ఈ విధంగా పచ్చదనం చాటున ఆకుకూరలతో విషవ్యర్థాలు తిరిగి మన శరీరాలకు సరఫరా అవుతున్నాయి.

ఇవేమీ లేకుండా పూర్తిగా ఆరోగ్యకరమైన వాతావరణంలో, రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగుమందులు వాడకుండా ఆకుకూరల్ని పండించి అమ్ముతున్న గ్రామం కురాకులతోట. ఇది కళ్యాణదుర్గం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. గ్రామం మొత్తంగా ఆకుకూరలే పండిస్తారు. ఆకుకూరలు, కాయగూరల పంటలైన మిరప, టొమేటో, వంకాయ లాంటి పంటలకు నార్లు పెంచి అమ్ముతారు. జిల్లాలోని చాలా గ్రామాల నుంచి రైతులు ఈ గ్రామంలోంచి మిరప, టొమెటో, వంకాయ లాంటి నారు మొలకల్ని కొని తీసుకుపోతూ ఉంటారు. ఏ సమయంలో ఏ ఆకు కూర ఎలా పెంచాలో, ఎండ కాలంలో సూర్యుని వేడి నుంచి నారును ఎలా రక్షించాలో వీరందరికి బాగా తెలిసిన విద్య. దాదాపు 100 సంవత్సరాల నుంచి వీరు కేవలం ఆకు కూరలు మాత్రమే పండిస్తున్నారు. ఇతరత్రా పంటలు వేయడం చాలా అరుదు. మొదటి నుంచీ ఆకుకూరల తోటకు పశువుల ఎరువు మాత్రమే వాడేవారు. ఏదైనా ఆకుముడతగానీ, మిడతలు లాంటివి పురుగులు సోకినప్పుడు రసాయనిక పురుగుమందులు వాడేవారు. అయితే గత సంవత్సరం నుంచీ వీటిని పూర్తిగా మార్చివేశారు. ఆకుకూర కయ్యలకు పశువుల ఎరువు వేస్తారు. రసాయనిక ఎరువుల బదులు సేంద్రీయ ఎరువులు వేయడంద్వారా ఆకుకూరల మడులలో నవనవలాడుతూ పెరుగుతుందని వీరి స్వానుభవం. ఆక్షన్ ఫ్రెటర్నా/ ఎకాలజీ సెంటరువారి తోడ్పాటుతో పురుగుమందులు వాడడం పూర్తిగా మానివేసినారు.

కురాకులతోట గ్రామానికి ఒక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. దాదాపు 100 సంవత్సరాల క్రితం వీరి పూర్వీకులు ఈ గ్రామానికి ఎగువ భాగాన ఉన్నటువంటి అక్కమ్మ కొండల మధ్యభాగంలో కాపురం ఉండేవారట. కారణమేమో తెలియదుకానీ కొంతమంది అక్కమ్మ కొండ దిగువ భాగానే పాతగ్రామం పేరుతోనే గ్రామాన్ని నిర్మించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. కొన్ని కుటుంబాలు మరికొంత దూరంలో ఒంటిమిద్ది అనే పేరుతో గ్రామాన్ని నిర్మించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. మరి కొంతదూరంలో చలపతి అనే చిన్నపాటి జమిందారు భూముల్ని సాగుచేయడం కొరకు ఒక గ్రామాన్ని నిర్మించుకొని స్థిరపడ్డారు. అదే ఈనాటి కురాకులతోట. ఒంటిమిద్దె పంచాయితీకాగా దేవాదుల కొండ, కురాకులతోట ఉపగ్రామాలు. వీరందరూ ఎక్కువ భాగం ఒకే సామాజిక (యాదవ) వర్గానికి చెందినవారు కావడం గమనించదగ్గది. మిగతా రెండు గ్రామాలవారు మిగతా ప్రాంతాలలోని రైతులలాగే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. కురాకులతోట గ్రామస్థులు విలక్షణంగా ఆకుకూరలు మాత్రమే పండించి అమ్ముకోవడం వృత్తిగా స్వీకరించారు. ఈనాడు గ్రామంలో 64 గడపలున్నాయి. అందులో ఒక్క కుటుంబం మాత్రమే దోభీ. మిగతావారందరూ యాదవ కులస్థులే. వీరికి ఆశ్రయమిచ్చిన చలపతి భూస్వామి కుటుంబీకులు ప్రస్తుతం ఎవరూ లేరు. వారి భూములను ఇతరులకు అమ్మివేయడమో, లేదా వదిలివేయడమో చేశారు. చాలా తక్కువ విస్తీర్ణంలోనే ఆకుకూరలు పండించే విధంగా వారి జీవనాన్ని కేంద్రీకరించడంవల్ల వారు భూవిస్తీర్ణం పెంచుకునే దిశగా ఆలోచించ లేదనిపిస్తుంది. రెండు-మూడు ఎకరాలకంటే ఎవరికీ ఎక్కువ భూమిలేదు. వ్యవసాయంలో వీరు ధనవంతులు కాలేదు కానీ, వరుస కరువుల్లో కూడా వీరికి తిండికి లోటు లేకుండా జీవనం గడిచినట్లు గొల్ల పెద్ద రంగన్న అనే రైతు చెప్పాడు. వీరికి పంట మార్పిడి ప్రయోజనం బాగా తెలుసు. సంవత్సరంలో ఒకసారి ఆకుకూరలు, కాయగూర పంటలతో మార్పిడి చేస్తుంటారు. ఎకరం, అర్థ ఎకరంలోనే ఒక కుటుంబానికి నిరంతరం పని ఉంటుంది. కొన్ని కయ్యల్లో ఆకు కోసి కట్టలు కట్టి, కళ్యాణదుర్గం గ్రామంలో తిరిగి అమ్ముకుంటారు. పాతరోజుల్లో గింజలకు మాత్రమే మారకం ఇచ్చేవారు. ఈనాడు కొంతమంది తిరిగి అమ్ముకుంటారు. కొంతమంది ఒకేచోట కూర్చుని అమ్ముకుంటారు. మరికొంతమంది అనంతపురం, ఉరవకొండలాంటి పట్టణాల్లోని వ్యాపారులకు అమ్ముతారు. వీరి గ్రామ ప్రాచుర్యం గురించి ఒక సంఘటన చెబుతారు. ఈ గ్రామంలో పండిన ఆకుకూరలను ప్రతి రోజూ రవాణా చేస్తూ ఒక కుటుంబం హైదరాబాదులోనే స్థిరపడిందట. ఈ గ్రామం నుంచి ఆకుకూరల్ని దిగుమతి చేసుకుంటూ హైదరాబాదులో వ్యాపారం నిర్వహించేవాడట. చిన్న చిన్న బావులు తవ్వుకుని ఏతంతో ఆకుకూరలు పండించుకున్న వీరు, ఈనాడు బోర్లువేసుకుని ఆకుకూరలు పండిస్తున్నారు.

టి.నారాయణ అనే రైతు ఎకరం పొలంలోనే కుటుంబాన్నంతా పోషిస్తున్నట్లు చెప్పాడు. సంవత్సరానికి 40-50 వేల రూపాయలదాకా ఆదాయం వస్తుందని చెప్పినాడు. ఈ గ్రామంలో ఆర్.డి.టి. సంస్థ అందరికీ ఇళ్ళు కట్టించి ఇచ్చింది. తాగునీటి బోర్లు వేసింది. ఒక పాఠశాల నిర్మించింది. ప్రస్తుతం బి.సి. పథకం కింద గ్రామాన్నే పూర్తిగా దత్తత తీసుకుందని గ్రామస్థులు చెప్పారు. ఈ గ్రామంలో మహిళా సంఘాలను పర్యవేక్షిస్తున్న ఒక కార్యకర్త చెప్పినదేమంటే, ఈ గ్రామంలో అందరూ ఐకమత్యంగా ఉంటారు. ముఖ్యంగా మహిళలలో చైతన్యం ఎక్కువ. ఆకుకూరల అమ్మకాలో రకరకాల మనస్థత్వాల వ్యక్తుల్ని చూసినవీరికి మంచి ఏమిటో, చెడు ఏమిటో వీరికి తెలిసినంతగా వేరే ఏ గ్రామంలోనూ లేదన్నారు. మహిళాసాధికారత అంటే ఏమిటో ఈ గ్రామంలో చూడవచ్చు.

విత్తనాల సమస్య వీరిని తీవ్రంగా వెంటాడుతోంది. మునుపటి రోజుల్లో ఆకుకూర విత్తనాలు చాలా సులభంగా దొరికేవని ఇప్పుడు చాలా డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని, అవికూడా నమ్మకంగా ఉండడం లేదని అన్నారు. మిరప విత్తనాలు ప్యాకెట్టు 50/- టమోటో, 100 గ్రా॥ ప్యాకెట్టు 70/- ధనియాలు 70/- వంకాయ విత్తనం కేజీ 2,500/- దాకా ఉందని చెప్పారు. అత్యున్నత పోషకవిలువలతో పాటు, ఆరోగ్యాన్ని కూడా పంచే ఈ ఆకుకూరలను పండించే రైతులకు నిరపాయకరమైనవిగా, రసాయనరహిత ఉత్పత్తులుగా గుర్తించి ఎక్కువ రేటుకు అమ్ముకునే విధంగా జిల్లా కేంద్రంలోనూ, కళ్యాణదుర్గం పట్టణంలోనూ ప్రభుత్వం వీరికి ఉచితంగా షాపుల సౌకర్యం కల్పించి ప్రోత్సహించాలి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in